గీత కార్మికుల కడుపు కోత

- పరిశ్రమల ఏర్పాటుకు తాటిచెట్ల నరికివేత
- వీధిన పడతామంటున్న గీత కార్మికులు

చిల్లకూరు: పరిశ్రమల ఏర్పాటు పేరుతో గీత కార్మికుల కడుపు కొడుతున్నారు. తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్ సుమారు 200 కుటుంబాలను వీధిన పడేస్తోంది. మండలంలోని తీర ప్రాంతంలో ఉన్న ఐదు గ్రామాల్లో ఎస్సీ, గౌడ, యాదవులు సుమారు 200 మంది కల్లు గీత మీద ఆధారపడి జీవనం చేస్తున్నారు. ఇందుకు గాను ఆయా గ్రామాల చుట్టుపక్కల ఉన్న తాటి చెట్లు, ఈత చెట్లను ఆధారం చేసుకుని సీజన్‌లో కల్లు గీసి విక్రయించుకుని జీవనం చేస్తున్నారు. ఇలా ఎన్నో ఏళ్లుగా జీవిస్తున్న వారికి పరిశ్రమల రాక గొడ్డలి పెట్టుగా మారింది. ఈ క్రమంలోనే సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో యాజమాన్యం ఆ ప్రాంతంలోని తాటిచెట్లు, ఈత చెట్లను తొలగించే పనిలో పడింది. పరిశ్రమ ప్రతినిదులతో గీత కార్మికులు తమ జీవనోపాధిపై ఇలా దెబ్బ కొడితే ఎలా అని గోడు వెళ్లబోసుకున్నారు. అయితే వారు పట్టించుకోకుండా చెట్లు తొలగించేస్తున్నారు. దీంతో గీత కార్మికులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.



తీర ప్రాంతంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసే ప్రాంతంలో విస్తారంగా ఉన్న తాటిచెట్లు



ప్లాంట్ ఏర్పాటు చేసే క్రమంలో యాజమాన్యం తొలగించిన తాటి చెట్లు

సొసైటీలో మూడు వర్గాల వారికి స్థానం

తీర ప్రాంతంలోని తమ్మినపట్నం, లింగవరం, పల్లెవాని దిబ్బ, తాళ్లబైట, తీగపాళెం గ్రామాల్లోని ఎస్సీ, గౌడ, యాదవులు తొలుత ఎవరికి వారుగా గీత గీసుకుని కల్లు విక్రయించుకునే వారు. అయితే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు వారి వద్ద పన్ను కట్టించుకోవడం మొదలు పెట్టారు. దీంతో వారంతా ఒక సొసైటీగా ఏర్పడి దానిని ప్రభుత్వంలో రిజిస్టర్ చేసి అటు తరువాత ప్రభుత్వం ద్వారా ప్రతి గీత కార్మికుడు గుర్తింపు పొంది ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకుంటున్నారు. అలాంటి వారు ఈ పరిశ్రమ ఏర్పాటుతో ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది.

ప్లాంట్ ఏర్పాటుతో జీవనం కోల్పోతున్నాం



తీర ప్రాంతంలోని ఐదు గ్రామాలకు సంబంధిచిన సుమారు 200 మంది కల్లు గీత కార్మికులు సొసైటీ ఏర్పాటు చేసుకుని ప్రతి ఏడాది సీజన్‌లో కల్లు గీసుకుని కుటుంబాలు పోషించుకుంటున్నారు. ఇప్పుడు ఆ భూముల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం సిద్ధమైంది. అందులో భాగంగా ఏళ్ల నాటి తాటి, ఈత చెట్లను తొలగించేస్తోంది. ఇలా చెట్లు తొలగింపుతో గీత కార్మికులు జీవనోపాధి కోల్పోతారు. వీరిందరికి ముందుగా నష్ట పరిహారం అందించిన అనంతరమే ప్లాంట్ పనులు చేపట్టాలి.

– కే రాంమోహన్, కల్లు గీత సొసైటీ అధ్యక్షులు, తమ్మిన పట్నం

ప్రతి కుటుంబానికీ ఉద్యోగం ఇవ్వాలి



సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసే వారు కల్లు గీత కుటుంబాల వారికి తగిన పరిహారం అందించాలి. దీంతో పాటుగా ప్రతి కుటుంబలోని ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి. ఇది పరిశ్రమల ఏర్పాటుకు ముందుగానే జరిగితే వలసలు పోవాల్సిన పని లేకుండా పోతుంది. ఇందుకోసం జిల్లా అధికారులు ప్లాంట్ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలి.

– ఎస్ బంగారయ్య, కల్లు గీత సొసైటీ ఉపాధ్యక్షులు, తమ్మినపట్నం

క్లుప్తంగా

సజ్జలను కలిసిన కామిరెడ్డి



పెళ్లకూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సజ్జలను శాలువాతో సత్కరించిన సత్యనారాయణరెడ్డి నియోజకవర్గంలో పార్టీ విషయాలపై చర్చించారు.

విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



రాగిజావను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

రాపూరు: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల క్లస్టర్ హెచ్ఎం అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని బొజ్జనపల్లి ప్రాథమిక పాఠశాలను మంగళవారం పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న రాగిజావ నాణ్యతను పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షలను ఆయన పరిశీలించారు.

ఎఫ్ఏ-2 పరీక్షల పరిశీలన

డక్కిలి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అసెస్‌మెంట్ (ఎఫ్ ఏ 2) పరీక్షలను మంగళవారం ఎంఈఓ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా డక్కిలి హైస్కూల్లో జరుగుతున్న పరీక్షలను సందర్శించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పాఠశాల వంట గది, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవలన్నారు.

ఈ నెల 16న హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట : పట్టణంలో వెలసిన శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఈ నెల 16న ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అండ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బీ ప్రసన్నలక్ష్మి తెలిపారు. దేవదాయ అధికారుల సమక్షంలో నిర్వహించనున్న హుండీ లెక్కింపు కార్యక్రమానికి ఆసక్తి కలిగిన భక్తులు పంచె, బనియన్‌తో వచ్చి లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన వచ్చని తెలియజేశారు.

చిన్నారులకు విద్యాసామగ్రి అందజేత



రాపూరులో చిన్నారులకు విద్యాసామగ్రి అందిస్తున్న రమేష్‌రెడ్డి

రాపూరు: మండలకేంద్రంలోని నార్త్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బండి రమేష్‌రెడ్డి కుటుంబసభ్యులు బుధవారం విద్యాసామగ్రిని అందించారు. విద్యార్థులకు అవసరమైన ప్యాడ్, పుస్తకాలు, పెన్ను, చాక్లెట్స్‌తో కూడిన కిట్లను అందించారు. తాము చదివిన పాఠశాలలో చిన్నారులకు విద్యాసామగ్రిని అందించడం ఆనందంగా ఉందన్నారు. హెచ్ఎం హసీన, బండి పెంచలరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్తీమద్యంపై నిరసన విజయవంతం

వెంకటగిరి రూరల్: ప్రాణం తీస్తున్న కల్తీమద్యంపై సోమవారం వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నిర్వహించిన నిరసన ప్రదర్శన విజయవంతమైనట్లు పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాటూరు రామతులసి తెలిపారు. ఆమె మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, నిరసన జయప్రదం చేసేందుకు తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

కండలేరులో 59.880 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 59.880 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3400 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,500, పిన్నేరుకాలువకు 300, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 200, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు 15-10-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	122
లేయర్ లైవ్	:	122
బ్రాయిలర్ చికెన్	:	222
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	244
లేయర్ చికెన్	:	207

నేడు కోటలో వైఎస్సార్‌సీపీ రచ్చబండ

కోట: మండలంలోని కొత్తపాళెం, జరుగుమల్లి గ్రామాల్లో బుధవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. దీనికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ హాజరవుతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ స్వాధీనం

కోట: విద్యానగర్ వద్ద గ్రావెల్ టిప్పర్‌ను మంగళవారం విజిలెన్స్ సీఐ వెంకట్రావు స్వాధీనం చేసుకున్నారు. ఊనుగుంటపాళెం నుంచి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నట్లు గుర్తించి జరిమానా విధించారు. పట్టుబడిన టిప్పర్‌ను పోలీసులకు అప్పగించారు.

ఆటో కార్మికులకు తీరని అన్యాయం

కోట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆటో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం మంగళవారం విద్యానగర్‌లో నిర్వహించారు. దీనికి హాజరైన ప్రభాకర్ మాట్లాడుతూ ఉచిత బస్సుల పేరుతో ఆటోవాలాలకు తీరని నష్టం జరిగిందన్నారు. ఆటో డ్రైవర్‌లకి ఇచ్చే రూ.15వేలు 20శాతం మందికి మాత్రమే వచ్చిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనాథ్, భాస్కర్, రాజు, గిరి,పెంచలయ్య, సీఐటీయూ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

ఓజిలి: గ్రామ పంచాయతీల్లో సొంతంగా ఆదాయం వచ్చే వనరులపై కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీఓ నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం సొంత ఆదాయ వనరులు పెంపొందించే(ఓఎస్ఆర్) కార్యక్రమంపై సర్పంచ్, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. దీనికి ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి హాజరయ్యారు. పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లకు సూచనలు, సలహాలు అందించారు. ఈయన వెంట ఈఓపీఆర్డీ రేణుక, కార్యదర్శులు ఉన్నారు.

పంచాయతీల ఆదాయం పెంచుకోండి

రాపూరు: మండలంలోని గ్రామ పంచాయతీల ఆదాయం పెంచుకునేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ భవాని పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చేపల చెరువుల వేలం పాటలు నిర్వహించడం, కుళాయి పన్నులు తదితరాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు.

పంచాయతీలు అభివృద్ధి సాధించాలి

కోట: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ దిలీప్ కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీలు సొంత ఆదాయ వనరులు పెంచుకునేందుకు ఉన్న అన్ని మార్గాలను అన్వేషించాలన్నారు. పంచాయతీలు బలోపేతం కావాలన్నారు.

పంచాయతీలు పురోగాభివృద్ధి సాధించాలి

చిల్లకూరు : పంచాయతీలు స్థానికంగా దొరికే ఆర్థిక వనరులను సాధించుకుంటూ పురోగాభివృద్ధి సాధించాలని అసిస్టెంట్ ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అన్ని పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పురోగతి సూచికపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పలు పంచాయతీల్లో పన్ను చెల్లింపులకు సంబంధించిన పలు అంశాలు ఉన్నాయని వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

చిట్టమూరు: మండలంలోని 23 పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య పేర్కొన్నారు. స్త్రీ శక్తి భవనంలో మంగళవారం ఓఎస్ఆర్(సొంత ఆదాయ వనరుల)పై పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ ప్రారంభించారు. ముందుగా మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరు గ్రామం సర్వే నంబరు 42లో ఉన్న ప్రభుత్వ భూమిలో మంగళవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి సంబంధిత భూమిలో ఎవరూ ప్రవేశించరాదంటూ సూచించారు. ఇటీవల గ్రామానికి చెందిన వ్యక్తి సుమారు 50 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేసే ప్రయత్నం చేశాడు. దాంతో స్థానిక సర్పంచ్ కందమూడి శివకుమార్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆర్ఐ సంతోషిణిబాయి, పంచాయతీ కార్యదర్శి శాంతి సంబంధిత ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వీరి వెంట వీఆర్ఏ కృష్ణ ఉన్నారు.



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సుబ్రమణ్యేశ్వర స్వామికి పవిత్రాల సమర్పణ



స్వామి వారికి పవిత్రాలు తీసుకొస్తున్న పురోహితులు, స్వామి వారికి పవిత్రాలు సమర్పిస్తున్న దృశ్యం

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామికి మంగళవారం భక్తి శ్రద్ధలతో పవిత్రాలు సమర్పించారు. స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవాల తర్వాత స్వామి వారికి పూర్వ వైభవం రావడానికి పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. దీంతో మూడు రోజులుగా ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో ద్వికాల యాగశాల, మహాపూర్ణాహుతి, కలశాభిషేకం, స్వామి వారికి విశేష వ్రత చరిత పూజ నిర్వహించారు. అనంతరం పురోహితులు స్వామి వారికి పవిత్రాలు సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి గ్రామోత్సవం నిర్వహించారు.

సేవాభావంతో మెలగాలి



మొక్కలు నాటుతున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

రాపూరు: విద్యార్థులు చిన్నతనం నుంచి సేవాభావం అలవరుచుకోవాలని ప్రభుత్వ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శివకుమార్ అన్నారు. మండలంలోని బొజ్జనపల్లిలో మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో భాగంగా పాఠశాల, సచివాలయంలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.

అందుబాటులో యూరియా

వెంకటగిరి రూరల్: వ్యవసాయశాఖ వెంకటగిరి సబ్‌డివిజన్ వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల పరిధిలో యూరియాను రైతులకు అదుబాటులో ఉందని వ్యవసాయశాఖ ఏడీఏ అనసూయన పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం ప్రైవేటు డీలర్లు, సహకార సంఘాల సభ్యులతో యూరియా విధివిధానాలపై అవగాహన కల్పించారు.

రైతులకు అవగాహన సదస్సు

కలువాయి(సైదాపురం): మండల వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ అధికారి ఏడీఏ శివనాయక్, పొదలకూరు, కలువాయి వ్యవసాయాధికారులు ప్రదీప్, కళారాణి ఆధ్వర్యంలో రైతులకు, రైతు డిపో డీలర్లకు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు.

వారిని కఠినంగా శిక్షించాలి

వెంకటగిరి రూరల్: సీజేఐపై దాడికి యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ జస్టిస్ బిఆర్ గవాయిపై కోర్టు సమయంలో దాడి యత్నాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు.

సురక్షితంగా దీపావళిని జరుపుకుందాం

గూడూరురూరల్ : దీపావళి వేడుకలను పురస్కరించుకుని సీఎన్‌జీ స్టేషన్లు, గ్యాస్ పైప్ లైన్లు, సర్వీస్ రెగ్యులేటర్లు, ఆర్‌సీసీ గార్డులు, వాల్స్ ఛాంబర్ల సమీపంలో టపాసులు, దీపాలు, కొవ్వొత్తులను వెలిగించడం నివారించాలని ఏజీపీ నెల్లూరు జిల్లా మేనేజర్ సతీష్ తెలిపారు. గూడూరు పట్టణంలోని శ్రీ వివేకానంద స్కూల్‌లో మంగళవారం సాయంత్రం సురక్షిత దీపావళిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏజీపీ ప్రతినిధులు రవి, శ్రీకాంత్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

వేమారెడ్డిని కలిసిన పార్టీ నాయకులు



వేమారెడ్డిని సత్కరిస్తున్న యద్దల నరేంద్రరెడ్డి, నాయకులు

చిల్లకూరు: మండలంలోని మోమిడి గ్రామానికి చెందిన వేమారెడ్డి కుమారస్వామిరెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో గూడూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువ కప్పి సత్కరించారు. వైఎస్సార్ సీపీలో ఇటీవల కుమారస్వామిరెడ్డిని ఎస్ఈసీ సభ్యులు నియమితులు కావడంతో, ఆయన్ను గూడూరు మండల నాయకులు యద్దల నరేంద్రరెడ్డి, బూదూరు గురవయ్య, కొండూరు సునీల్‌రెడ్డి, అట్ల శ్రీనివాసులరెడ్డి, జనార్ధనరెడ్డి, మనుబోలు క్రిష్ణయ్య, మల్లి రమేష్, కొట్టు అశోక్, మహేంద్ర, ప్రభాకర్‌రాజుతోపాటు చిల్లకూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ యద్దల మదుసూదన్ రెడ్డి ఉన్నారు.

చేపల వేలం పాట



బంగారంపేటలో నిర్వహిస్తున్న వేలం పాట

పెళ్లకూరు: మండలంలోని బంగారంపేట పెద్ద చెరువులో చేపలు పట్టుకోవడానికి మంగళవారం స్థానిక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ప్రణయ్‌రాయ్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఇందులో రూ.33 వేలు ప్రభుత్వ పాట నుంచి రూ.88 వేలుకు పెమ్మిడి వెంకటేశ్వర్లు దక్కించుకున్నారు. వచ్చే ఏడాది జూన్ 30వ తేదీ వరకు చేపలు పట్టుకునే హక్కు ఉంటుందని సూచించారు. అయితే చెరువునీటిని వృథా చేయడం, చేప పిల్లలు వదలడం, చేపల పెరుగుదల కోసం వ్యర్థాలు వంటివి చెరువులో వేయడం కుదరదన్నారు.

శిక్షణకు 90 శాతం సర్పంచుల డుమ్మా!

పెళ్లకూరు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఓఎస్సార్ (ఓన్ సోర్స్ రెవెన్యూ) శిక్షణ కార్యక్రమానికి తొలిరోజు 90శాతం సర్పంచులు డుమ్మా కొట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొన్ని రోజులు కిందట మండల అభివృద్ధి అధికారులకు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చిన అనంతరం మండల స్థాయిలో సర్పంచులకు శిక్షణ ఇచ్చేలా తర్ఫీదు ఇచ్చారు. అయితే మండలంలోని 24మంది సర్పంచులకు గాను తొలిరోజు జీలపాటూరు, బంగారంపేట, పునబాక, రావులపాడు సర్పంచులు మినహా తక్కినవారు డుమ్మా కొట్టారు. చెరువుల్లో చేపలు పట్టుకోవడం, ఇంటి పన్ను వసూలు, ప్రభుత్వ భవనాలు, స్థలాలు అద్దెకు ఇవ్వడం తదితర వాటిపై పంచాయతీ రెవెన్యూ పెంచుకోవడంపై శిక్షణ ఇచ్చారు. అయితే ఎక్కువ మంది పంచాయతీ సర్పంచులు గైర్హాజరు కావడంతో తొలిరోజు నామ మాత్రంగా ముగిసింది.

దివ్యాంగుల క్రీడలకు సహకారమందిస్తా



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పెంచల నరసయ్య

వెంకటగిరి (సైదాపురం): దివ్యాంగుల క్రీడా పోటీల నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తామని తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన్ను మంగళవారం రాష్ట్ర బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పరుచూరి పెంచల నరసయ్య తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ అంధ యువతలో నైపుణ్యం, ఆత్మవిశ్వాసం పెంచేందుకు పెంచల నరసయ్య చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని కొనియాడారు. దివ్యాంగ క్రీడాకారుల అభివృద్ధికి సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.

ముక్కంటి సేవలో ఏపీఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు

శ్రీకాళహస్తి : జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం ఏపీఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి అధ్యక్షుడు చెంచురత్నంయాదవ్, సెక్రటరీ బాలచంద్రయ్య, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాఘవులు, సెక్రటరీ రమేష్, తిరుపతి జిల్లా అడహక్ చైర్మన్ సురేష్ బాబు, ట్రెజరర్ లలిత్ కుమార్, సంఘం వైస్ చైర్మన్ భాస్కర్ , సంఘం సభ్యులు చంద్రకాంత్, గణేష్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులను గెంటేసి... అంగన్‌వాడీ గది ఆక్రమణ



జనసేన నేత ఫ్రీజర్ ఉంచి తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ భవనం గది

చిట్టమూరు: అధికారం మాది.. అంతా మా ఇష్టం అంటూ కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. జనసేన నేత నిర్వాకంతో 22 మంది చిన్నారులు వసతి లేక అల్లాడిపోతున్నారు. ఎండ కాస్తే ఉక్క పోత, వానొస్తే తడిసి ముద్దయిపోతున్నారు. మండలంలోని గునపాడు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. అధికారులు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చిన్నారులను తరలించారు. అయితే అది మోడల్ స్కూల్ కావడంతో అక్కడ 94 మంది విద్యార్థులున్నారు. వారికే తరగతి గదులు సరిపోక చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ చిన్నారులు వరండాలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అంగన్‌వాడీ భవనంలో ఓ గది బాగుందంటూ గ్రామంలోని జనసేన నేత ఒకరు ఆ గదికి సున్నం వేయించి అందులో తనకు చెందిన ఫ్రీజర్‌ను ఉంచి ఆ గదికి తాళం వేసుకుని వెళ్లాడు. ఇదేమిటని అడిగితే 'మాది అధికార పార్టీ.. అంతా నా ఇష్టం' అంటూ బెదిరింపులకు దిగుతున్నాడు. చేసేది లేక వర్షం వస్తే అంగన్‌వాడీ భవనం పక్కన ఉన్న సాగునీటి కార్యాలయానికి చెందిన చిన్న గదిలో పిల్లలు తలదాచుకుంటున్నారు. వర్షం రాకపోతే ప్రాథమిక పాఠశాల వరండాలో కాలం వెళ్లబుచ్చుతున్నారు. మరో పక్క చిన్నారులకు మధ్యాహ్న భోజనం వండేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు అంగన్‌వాడీ సిబ్బంది వాపోతున్నారు. దీనిపై గ్రామస్తులు ఐసీడీఎస్ అధికారికి, ఎంపీడీఓకు వినతిపత్రం ఇచ్చినా స్పందనే లేదని పేర్కొన్నారు.



ప్రాథమిక పాఠశాల వరండాలో కూచున్న అంగన్‌వాడీ చిన్నారులు